
ఆంధ్రజ్యోతి

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.9 ; కనిష్ఠం 24.2

కామారెడ్డి జిల్లా వార్తలు

5


ఆదివారం 30 జూన్ 2024





» చిన్నపాటి వర్షాలకే గ్రామాల్లో మొదలైన జ్వరాలు
» గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య లోపం
» పెరుగుతున్న దోమల బెడద
» డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వ్యాధులు ప్రబలే అవకాశం
» నీరు నిల్వ ఉండకుండా.. అప్రమత్తంగా లేకుంటే ముప్పే అంటున్న వైద్యులు

పొంచిఉన్న వ్యాధుల ముప్పు!



కామారెడ్డి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు కురుస్తుండడంతో పల్లెలు, పట్టణాల్లో పారిశుధ్యం లోపించి రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. డ్రైనేజీలు లేనిచోట మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. ప్రతీ ప్రాంతాల్లో గుంతలు, ఖాళీ ప్రదేశాలలో నీరు నిలిచి దోమలు, ఈగలకు నిలయాలుగా మారుతున్నాయి. ఈ క్రమంలోనే కీటకజనిత వ్యాధులతోపాటు సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లాంటివి వ్యాపించే ప్రమాదం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. ఇటీవల లింగంపేటలో పల్లె ప్రజలు అనారోగ్యంతో మంచాన పడ్డారు. అందులో ఓ వ్యక్తికి దోమకాటుతో ప్లేట్‌లెట్స్ తగ్గి పరిస్థితి విషమించింది. జిల్లాలో ప్రధానంగా మారుమూల గ్రామాలు, మురికివాడల్లో పారిశుధ్య పనులు లోపిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లోనూ సీజనల్ వ్యాధులు సోకే అవకాశాలు ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యఆరోగ్యశాఖ పేర్కొంటోంది.

• పారిశుధ్య లోపంతో పెరగతున్న దోమల బెడద

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎక్కడచూసినా మడుగులు కట్టిన నీటితోపాటు అంతటా అపరిశుభ్రతే కన్పిస్తోంది. ఇంకేముంది.. దోమలకు ఆవాసాలకు పరోక్షంగా మనమే సహకరిస్తున్నట్లు అవుతోంది. పల్లెలు, పట్టణాల్లో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు, మురుగుకాల్వలు పేరుకపోయి వాటికి ఆవాసాలుగా మారాయి. ఇంటి పరిసరాలు శుభ్రంగా లేక రోగాలకు కేంద్ర బిందువులుగా దర్శనిమిస్తున్న అలసత్వం వహిస్తే ఆసుపత్రులలో లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో దోమకాటు నుంచి తప్పించుకోవాలంటే అప్రమత్తంగా ఉండడమే మొదటిమందు అని వైద్యులు సూచిస్తున్నారు. పారిశుధ్య సిబ్బందితో పాటు మనవంతుగా పరిశుభ్రమైన వాతావరణం ఉంచుకుంటేనే వ్యాధులు దరిచేరవని పేర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లల విషయంలో మరీ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. అందుకే ప్రతిఒక్కరూ వ్యాధుల లక్షణాలు, వాటి కారకాల గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచిస్తున్నారు.

• వ్యాధులు, లక్షణాలు.. వాటి చికిత్స

మలేరియా: మలేరియాను కలుగజేసే జీవి ప్లాస్మోడియం ప్రాణాంతకమైన ఆనాఫిలాస్ దోమ దీనికి కారణం. ఈ వ్యాధి ఆడ ఎనాఫిలిస్ దోమకాటుకు గురైన వ్యక్తిలో దాదాపు 10-15 రోజుల్లో మలేరియా లక్షణాలు బయటపడతాయి. చలితో కూడిన తీవ్రమైన జ్వరం, వణుకు, వాంతులు, తలనొప్పి అధికంగా ఉండి రాత్రివేళల్లో జ్వరం ఎక్కువగా వస్తుంది. ప్లాస్మోడియం వైవాక్స్ చికిత్స సాధారణంగా క్లోరోఫిన్ మందునే వాడుతారు. ఆ తర్వాత రెండు వారాలపాటు ప్రమోక్విన్ అనే మందును ఇస్తారు. కొందరికి క్లోరిఫిన్ మందు పనిచేయకపోతే రెండు మూడు రకాల కాంబినేషన్లలో మందు వాడాలి.

డెంగీ: డెంగీ వ్యాధికి ఆర్బోవైరస్ జాతికి చెందిన అతి సూక్ష్మమైన వైరస్ కారణం. ఈ వైరస్ ఈజిప్టిఎడిస్ జాతికి చెందిన టైగర్ దోమగా పిలువబడే దోమ ద్వారా రోగస్తుల నుంచి ఆరోగ్యవంతులకు సంక్రమిస్తోంది. ఏడిస్ దోమలు పగటిపూటనే మనుషులను కుడుతాయి. కుట్టిన 5-10రోజుల తర్వాత వ్యాధిలక్షణాలు బయటపడ తాయి. ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం రావడంతోపాటు టెంపరేచర్ ఎక్కువగా ఉండి విపరీతమైన తలనొప్పితో పాటు కంటిలోపల నొప్పి వచ్చి కదలికలు తగ్గుతాయి. కీళ్లు, కండరాల నొప్పులుంటాయి. రక్తపరీక్షలో తెల్లరక్తకణాలు తగ్గిపోతాయి. యంటీ డెంగీ, యాంటీ బాడిలతో రోగనిర్ధారణ చేయవచ్చు. అయితే వ్యాధి ప్రారంభ దశలో ఇవి కనిపించకపోవచ్చు. డెంగీ వ్యాధికి ప్రత్యేకంగా మందులు లేవు కాబట్టి పరీక్ష పద్ధతిలో చికిత్స విధానం ఉంటుంది. రోగులకు నోటి ద్వారా, రక్తనాళాల ద్వారా ద్రవాలను పంపించుకుంటూ మధ్యలో ప్లేట్‌లేట్స్ ఎక్కిస్తారు. ప్లేట్ లెట్స్ సంఖ్య చాలా వరకు పడిపోయినా లేదా రక్తస్రావం ఉన్నప్పుడు ఇచ్చే సింగిల్ డోనర్ ప్లేట్ లెట్స్ లేక యాంటి ఆర్‌హెచ్‌డీ ఇంజక్షన్లు ఇచ్చి చికిత్స నిర్వహిస్తారు. డెంగీ జ్వరం వచ్చిందంటే సకాలంలో చికిత్స తీసుకుంటే ప్రాణాలకు ముప్పు ఉండదు.

చికెన్‌గున్యా: చికెన్‌గున్యా లాంటి వ్యాధిలో జ్వరాలు ఎక్కువగావచ్చే అవకాశం ఉంది. ఇది కూడా దోమకాటు ద్వారానే వస్తుంది. కాళ్లు, చేతుల్లో కీళ్ల నొప్పులు అధికంగా వేధిస్తాయి. దోమకుట్టిన 3-7 రోజుల వ్యవధిలో ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. మొదట తలనొప్పి తీవ్రంగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో కీళ్ల వాపు కూడా వచ్చి జ్వరం తగ్గినా కానీ కొన్నివారాల నుంచి సంవత్సరం పాటు నొప్పులు ఉంటాయి. లక్షణాలను బట్టి వైద్యులు ఈ వ్యాధిని గుర్తిస్తారు. దీనికి ప్రత్యేక చికిత్స లేదు. కాబట్టి కొన్నిజ్వరాల మాదిరిగానే చికిత్స చేస్తారు. పూర్తిగా నయమయ్యే వరకు వైద్యుల పర్యవేక్షణలో తప్పనిసరిగా ఉండాలి.

అతిసార: నీరు కలుషితమైతే అతిసార (డయేరియా) వ్యాధి వస్తుంది. రోటావైరస్ వల్ల వస్తుంది. విరేచనాలు ఎక్కువగా ఉంటాయి. వాటితోపాటు రక్తం కూడా పడితే డీసెంట్రీ అంటారు. ఇది వివిధ రకాలైన బ్యాక్టీరియా, ప్రొటోజోవాలతో వస్తుంది. రక్తంలో లవణాలు ఎలా ఉన్నాయో పరిశీలించి నిర్ధారిస్తారు. చికిత్సలో భాగంగా మినరల్స్‌తో కూడిన నీటిని తాగాలి. తాగేస్థితిలో లేకుంటే సైలెన్ ద్వారా ఎక్కిస్తారు. సరైన మాత్రలు వేసుకుంటూ తగినంత విశ్రాంతి తీసుకోవాలి.

పరిసరాల శుభ్రతే ప్రధానం

• చంద్రశేఖర్, డీయంహెచ్‌వో, కామారెడ్డి

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధుల బారి నుంచి బయట పడవచ్చు. దోమలు ఇంట్లోకి రాకుండా తలుపులు, కిటికిలకు జాలితెరలు అమర్చుకోవాలి. దోమతెరలు విధిగా వాడాలి. అలాగే పరిసరాల్లో దోమల నివారణ మందును పిచికారి చేసుకోవాలి. శరీరం నిండుగా ఉండేవిధంగా దుస్తులు ధరించాలి. మూత్రవి సర్జన తర్వాత భోజనానికి ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.



డీఎస్ ఇకలేరు!

» అనారోగ్యంతో హైదరాబాద్‌లో కన్నుమూత
» హైదరాబాద్‌లో పలువురు ప్రముఖుల నివాళులు
» నిజామాబాద్‌కు చేరుకున్న డీఎస్ పార్థివదేహం
» నేడు నిజామాబాద్‌లోని బైపాస్ రోడ్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

నిజామాబాద్, జూన్29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ సీనియర్ నేత, పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ ఇకలేరు. అనారోగ్యంతో హైదరాబాద్‌లో శనివారం ఉదయం 3గంటల సమయంలో కన్నుమూశారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించిన ఆయన పలు పదవులను అధిష్టించారు. ఎమ్మెల్యే, పీసీసీ అధ్యక్షుడిగా, రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. రెండుదఫాలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అభివృద్ధితోపాటు ఇతర కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎంతో క్రియాశీలకంగా వ్యవహరించిన డీఎస్ ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులోనే కీలక పాత్ర పోషించారు. రాష్ట్రప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి డీఎస్ పార్థివదేహానికి నివాళులర్పించారు. డీఎస్ కుటుంబ సభ్యులకు తన సంతాపాన్ని తెలిపారు.

• నేడు నిజామాబాద్‌లో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీ మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన డీఎస్ అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించనున్నారు. ఆయన చేసినసేవలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలతో నిజామాబాద్ నగర శివారులోని బైపాస్ రోడ్‌లో ఆయన వ్యవసాయ భూమిలోనే ఆదివారం అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శనివారం సాయంత్రం పరిశీలించారు. అంత్య క్రియల ఏర్పాట్లలో నగర కార్పొరేషన్ కమిషనర్ మకరంద్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

నేడు నిజామాబాద్‌కు సీఎం రాక

• డీఎస్ అంత్యక్రియల్లో పాల్గొననున్న రేవత్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి నేడు నిజామాబాద్‌కు రానున్నారు. డీఎస్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు హెలీక్యాప్టర్ ద్వారా నిజామాబాద్‌కు రానున్న సీఎం నేరుగా ప్రగతినగర్‌లోని ఆయన ఇంటికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులు అర్పిస్తారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. ప్రభుత్వం తరఫున లాంచనాలతో ఈ అంత్యక్రియలు జరుపుతుండటంతో సీఎం హాజరవుతున్నారు. ఆయనతోపాటు మంత్రులు కూడా రానున్నట్లు తెలుస్తోంది. పోలీసులు ప్రగతినగర్‌వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. సీఎం ఉదయం 11 గంటల లోపు రానున్నట్లు అధికారులు తెలిపారు.

కోటను సందర్శించిన 14 రాష్ట్రాల విద్యార్థుల బృందం

దోమకొండ, జూన్ 29: మండల కేంద్రంలోని గడి కోటను శనివారం 14రాష్ట్రాలకు సంబంధించిన విద్యార్థుల బృందం సందర్శించారు. కోటలోని అద్దాల బంగ్లా, రాజభవనం, చుట్టూ కందకం, శివాలయం అందాలను తిలకించారు. కోట చరిత్రను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. 14 రాష్ట్రాల నుంచి 250 మంది విద్యార్థులు సందర్శించినట్లు నేషనల్ యునైటెడ్ యూత్ చైర్మన్ వెంకటేశ్వర్లు తెలిపారు. కోటను తెలంగాణ, ఒరిస్సా, బీహార్, ఛత్తీస్‌గాడ్, కర్ణాటక, అస్సాం, రాజస్థాన్, వెస్ట్‌బెంగాల్, హర్యానా, కేరళ, త్రిపుర, మధ్యప్రదేశ్, పాండిచ్చేరి, తదితర రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, నిహారిక, రాజ్‌కుమార్, దత్తాద్రి, పాపాలి,జయశ్రీ,పవన్, పరశురాం, తదితరులు పాల్గొన్నారు.



దోమకొండ గడికోటలో 14 రాష్ట్రల బృందం

పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను

పది రోజుల్లోగా పరిష్కరించాలి

• అధికారులను ఆదేశించిన చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ నవిన్‌మిట్టల్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కామారెడ్డి టౌన్, జూన్ 29: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను రానున్న పది రోజుల్లోగా పరిష్కరించాలని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ నవిన్‌మిట్టల్ జిల్లా కలెక్టర్‌లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి పెండింగ్ ధరణి సమస్యల పరిష్కరంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రివ్యూ నిర్వహించారు. జూన్ 18 నుంచి జూన్ 28 వరకు పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్నచర్యలపై జిల్లాల వారిగా అడిగితెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేసిన తర్వాత సంబంధిత దరఖాస్తుల ఆన్‌లైన్‌లో అప్‌డేట్‌చేసి పరిష్కారించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ల బదిలీల నేపథ్యంలో కొంతనెమ్మదించిన ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పెండింగ్ దరఖాస్తులను 10 రోజుల వ్యవధిలో పరిష్కరించాలని సూచించారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎస్‌సీ,ఎస్‌టీ,బీసీ, మైనార్టీ విద్యార్థుల కోసం సమీకృత గురుకుల విద్యా సంస్థ ఏర్పాటుకు అనుకులంగా 20 ఎకరాల స్థలాన్ని గుర్తించాలని అన్నారు. ఆధార్ బయోమెట్రిక్ వేలి ముద్ర స్వీకరణ సంబంధించి ఎల్‌ఓ పరికరాల వినియోగగడువు ముగుస్తున్న నేపథ్యంలో జిల్లాలకు ఎల్-1 బయోమెట్రిక్ పరికరాలు పంపడం జరిగిందని తెలిపారు. కార్యాక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌టీఓలు రంగనాథ్‌రావు, ప్రభాకర్, రమేష్ రాథోడ్, ఏవో మసూర్ అహ్మద్, పర్యవేక్షకుడు ఉమలత తదితరులు పాల్గొన్నారు.

ఎనిమల్ కేర్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్

కామారెడ్డిటౌన్: కామారెడ్డి పట్టణ పరిధిలోని రామేశ్వర్‌పల్లి ఎనిమల్‌కేర్‌సెంటర్‌ను శనివారం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సందర్శించారు. 182 కుక్కలకు పిల్లలు పుట్టకుండా శస్త్రచికిత్సలు చేసినట్లు జిల్లా పశువైద్యాధికారి సింహారావు కలెక్టర్‌కు తెలిపారు. గ్రామాల్లో కుక్కల సంతతి పెంచకుండా కు.ని. శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. ఎనిమల్ కేర్ సెంటర్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కమిషనర్ సుజాత ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్



ఆత్మకు ఆదరణ కరువు!

• పత్తాలేని సదస్సులు, యాత్రలు • అన్నదాతకు అవగాహన కార్యక్రమాల్లేవ్ • నాలుగేళ్లుగా నిలిచిన పథకం

కామారెడ్డి టౌన్, జూన్ 29: వ్యవసాయం లాభసాటిగా మార్చడంలో భాగంగా అన్నదాతలకు ఆధునిక విజ్ఞానం, అవగాహన కల్పించడానికి కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ(ఆత్మ))కు నిధుల కటకట పట్టుకుంది. జిల్లాలో నాలుగేళ్లుగా ఆత్మ పథకానికి నిధులు విడుదల కాకపోవడంతో కార్యక్రమాలు నిలిచిపోయాయి. కేంద్రప్రభుత్వం 60శాతం, రాష్ట్రప్రభుత్వం 40శాతం నిధులు కేటాయించి వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే సాగుతోపాటు అనుబంధ రంగాలైన పాడి, పశుసంవర్ధక, ఉద్యాన, వ్యవసాయ, మత్స్యశాఖల అధికారులు సంయుక్తంగా రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలో వానకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ ఆత్మ కింద ఎటువంటి కార్యక్రమాలు చేపట్టడం లేదు. ఫలితంగా రైతులకు సాగు సమయంలో తీసుకోవాల్సిన సాంకేతిక అంశాల పైన అవగాహన కరవవుతోంది. విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో రైతులకు సూచనలు, సలహాలు అందడం లేదు.

• విడుదల కాని నిధులు

ఆత్మ ద్వారా సూచనలు అందించేందుకు ప్రభుత్వానికి నిధుల మంజూరు కోసం అధికారులు ప్రతిపాదనలు పంపించగా ఆమోదం లభించిన నిధుల మంజూరు జరగలేదు. నిధులు విడుదల కాకపోవడంతో వ్యవసాయఅధికారులు, సంబంధిత రంగాల అధికారులు రైతులకు ఎటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. గత ఏడాది సైతం ఆత్మ కార్యక్రమాలకు నిధులు మంజూరుకాలేదు. సుమారు నాలుగైదు సంవత్సరాల నుంచి ఆత్మ నిధులు సరైన సమయాల్లో రాకపోయినప్పటికీ వ్యవసాయ అధికారుల వద్ద నిలువ ఉన్న ఇతర నిధుల ద్వారా కార్యక్రమాలు చేపట్టారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం ఒక్క పైసా విడుదల చేయకపోవడం, ఇతర నిధులు అందుబాటులో లేకపోవడం తదితర కారణాల వల్ల అధికారులు ముందుకు కదలడం లేదు.



• అనుబంధశాఖల్లోనూ ఇదే పరిస్థితి

వ్యవసాయంలో రైతులు మెరుగైన ఆదాయం సాధించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడంలో వ్యవసాయశాఖతో పాటు అనుబంధ శాఖలైన పశు, మత్స్య, ఉద్యాన, పట్టు,పౌల్ట్రి, మార్కెటింగ్ వంటి వాటిల్లో సైతం ఒకే పరిస్థితి నెలకొంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన ఆత్మద్వారా శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పర్యటనలు, నూతన సాంకేతికత అభివృద్ధి అంశాలు, కిసాన్ మేళాలు, శాస్త్రవేత్తలతో రైతుల సమావేశాలు, ఎరువుల, విత్తనాల వినియోగం, సాగులో కనబరిచిన ప్రోత్సాహకాలు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వర్తించాల్సి ఉన్నప్పటికీ నిధులు రాక ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదు.

• సదస్సులు లేవు.. యాత్రలు కనిపించవు

ప్రస్తుత వానాకాలంలో ఎలాంటి సూచనలు, సలహాలు, సదస్సులు, విజ్ఞాన యాత్రలు ఆత్మ ద్వారా జరగడం లేదు. అందుబాటులో శాస్త్రవేత్తలు, వ్యవసాయ, అనుబంధ శాఖల అనుభవజ్ఞులైన అధికారులు ఉన్నప్పటికీ ఫలితం లేకుండా పోతుంది. గతంలో జిల్లాలోని ప్రతినియోజకవర్గ కేంద్రం, వ్యవసాయ సబ్‌డివిజన్ కేంద్రాల్లో ఘనంగా రైతు సదస్సులు నిర్వహించేవారు. రైతులను రప్పించి స్థానికంగా పలు ప్రదర్శనలు ఇచ్చేవారు. ప్రతిఏడాది వేసవి, వానాకాలం సీజన్లకు ముందుగా ఇతర జిల్లాలో అనుసరిస్తున్న విధానాలను ప్రత్యక్షంగా వివరించేందుకు ఆత్మపథకం కింద ప్రత్యేకబస్సుల్లో విజ్ఞాన యాత్రలకు రైతులను తీసుకువెళ్లి అవగాహన కల్పించేవారు. ప్రస్తుతం ఇటువంటి వాటికి అధికారులు స్వస్తి పలకడంతో రైతులకు ఎవరికి వారే మెళుకువలను తెలుసుకుని సాగుచేసుకునే దుస్థితి నెలకొంది.





సబ్‌స్టేషన్ ముట్టడించిన యువకులు

సిరికొండ జూన్ 29 :మండల కేంద్రమైన సిరికొండలో ప్రతి రోజు విద్యుత్ సరాఫరాలో అంతరాయం కలుగుతుందని సిరికొండ యువకులు శనివారం విద్యుత్ కేంద్రాన్ని ముట్టడించారు. పగలు,రాత్రి అనే తేడా లేకుండా విద్యుత్ సరాఫరాలో తీవ్రమైన అంతరాయం కలుగుతున్నదున గ్రామానికి చెందిన యువకులు వీడీసీ ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్‌కు తరలివెళ్లి ఏఈని నిలదీసినంత పని చేశారు. గ్రామంలో ఎందుకంత విద్యుత్ సమస్య తలెత్తుతుందని ఏఈ చంద్రశేఖర్‌ను ప్రశ్నించారు. మండలంలోని ఏ గ్రామంలో కూడా ఇన్ని దఫాలుగా విద్యుత్ నిలిచిపోవడానికి గల కారణమేమిటని యువకులు ఏఈ నిలదీశారు. మా గ్రామంలో విద్యుత్ సమస్య ఉత్పన్నం కావడానికి ప్రధాన కారణం హుస్సేన్‌నగర్‌కు నేరుగా, చిన్నవాల్గోట్‌కు సప్లయ్ చేసే ఫీడర్ల వల్లెనని యువకులు ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. ఏఈ మాట్లాడుతూ విద్యుత్ సరాఫరాలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని అన్నారు. చిన్నవాల్గోట్ ఫీడర్ వల్ల ఎలాంటి సమస్యలే లేవని ఆయన యువకులు సమధానం ఇచ్చారు. హుస్సేన్‌నగర్ ఫీడర్ సమస్య పరిష్కారం తనతో కాదని అది ఉన్నతాధికారుల చేతులో ఉందని ఏఈ చంద్రశేఖర్ వారితో చెప్పారు.

గుంతలు పూడ్చిన పూర్వవిద్యార్థులు

కమ్మర్‌పల్లి, జూన్ 29: కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన యువకులు, పూర్వ విద్యార్థులు బుధవారం జాతీయరహదారిపై ప్రమాద భరితంగా మారిన గుంతలను సిమెంట్ మిక్సింగ్‌తో పూడ్చివేత కార్యక్రమాన్ని చేపడుతు తమవంతు సేవ దృక్పథాన్ని చాటుకుంటున్నారు. కమ్మర్‌పల్లి మోర్తాడ్ మండలాల సరిహద్దు నుండి జిల్లా సరిహద్దు గండిహనుమాన్ వరకు జాతీయరహదారిపై అడుగులోతో గుంతలు ఏర్పడ్డాయి. గుంతలు రహదారి గుండా వెళ్లే వాహనదారులకు ప్రాణసంకటంగా మారాయి. కాగా మంగళవారం కమ్మర్‌పల్లి నుండి మెట్‌పల్లి వైపు తన కొడుకుతో స్కూటీపై వెలుతున్న డిష్ నరేందర్ అనే వ్యక్తి ఎదరుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి స్కూటీ టైరు గుంతలో పడగా ఇద్దరు ఎగిరిపడి తీవ్రగాయాలపాలై ప్రస్తుతం హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో స్పందించిన కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన 1996-97 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు జాతీయరహదారిపై ఏర్పడిన ప్రమాదభరితంగా మారిన గంతలను పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. గుంతల్లో సిమెంట్ కంకరతో పూడ్చి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపడుతున్నారు.







విద్యుత్ షాక్‌తో యువకుని మృతి

బోధన్ రూరల్, జూన్ 29: బోదన్ పట్టంలోని రాకాసిపేట్‌లో ఓ ఇంటి నిర్మాణం చేస్తుండగా కూలీ పనికి వెళ్లిన పవన్ (24) అనే యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. సంఘటనకు సంబందించి సిఐ వీరయ్య తెలిపిన వివరాల ప్రకారం ఇంటి ఇర్మాణం పనులలో భాగంగా కూలీ పనికి వచ్చి ఇంటి స్లాబ్‌పైకి ఎక్కి ఇనుప రాడు తీస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలకు రాడు తగలడంతో పవన్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడని, స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరిస్తుండగా మృతిచెందాడని తెలిపారు. మృతుడు బెల్లాల్ గ్రామానికి చెందిన వాడు. మృతుని తల్లి అబ్బవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి'

ఎడపల్లి, జూన్ 29: చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని బోధన్ జేఎఫ్‌సీఎం న్యాయాధికారి సాయిశివ అన్నారు. మండల కేంద్రంలోని ఎడపల్లి గ్రామ శివారులో ఉన్న తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒకచోట అవమానాలపాలు అయి ఉంటారని అలాంటప్పుడే వాటిని ఎదుర్కొని జీవితంలో స్థిరంగా నిలబడాలని ఆయన సూచించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులు, పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆడపిల్లలకు ఏమైనా సమస్యలు వచ్చినపుడు తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు తెలిపి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ నరేష్, ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ సుహాసిని రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సునీల్ కుమార్

ఏర్గట్ల, జూన్ 29: మండలంలోని తాళ్ళరాంపూర్ గ్రామానికి చెందిన బోదాసు గంగాధర్ ఇటీవలే తాటిచెట్టు నుంచి పడి మృతి చెందగా శనివారం బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి పది వేలు ఆర్థిక సహాయంగా అందజేసి బాధిత కుటుంబానికి అన్ని విధాల ఆదుకుంటామని భరోస ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, ఆడెపు గంగాప్రసాద్, పెద్దిరెడ్డి రవి, బెజ్జారపు భాను, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పనులు పరిశీలించిన కమిషనర్

ఆర్మూర్‌టౌన్, జూన్29 : మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. శనివారం ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద డ్రైనేజీ పనులతో పాటు 19 వార్డులో పలు కట్టడాలతో పాటు సోషల్ వెల్ఫేర్ మహిళ స్కూల్‌లోని వంట గదిని, ఆల్‌ఫోర్స్ కళాశాలలోని మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు సానిటరీ ఇన్స్‌పెక్టార్ మహేష్, టౌన్‌ప్లానింగ్ అధికారి హరిష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థులకు సన్మానం

పెర్కిట్, జూన్29: జెఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన క్షత్రీయ జూనియర్ కళాశాల విద్యార్థినిలు వై.నవ్య, ఎం.పూజితలను కళాశాల యాజమాన్యం శాలువ, పుష్పగుచ్చంతో ఘనంగా సన్మానించారు. నవ్య ఎన్‌ఐటీలో ఆంధ్రప్రదేశ్, పూజిత ఎన్‌ఐటీ పాట్నలో సీటు సంపాదించారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, అధ్యాపక బృందం పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

యువతి ఆత్మహత్య

మోస్రా, జూన్ 29: మండలంలోని ఓ గ్రామంలో నిజామాబాద్‌లో ఫ్యాషన్ డిజైన్ చదివే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. యువతిని మరొక గ్రామానికి చెందిన యువకుడు వేధించడంతో మనస్థాపం చెందిన యువతి శుక్రవారం రాత్రి తన ఇంట్లో ఉరి వేసుకుని చనిపోయినట్లు తెలిపారు.యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఉమ్మడి వర్ని మండల ఎస్ఐ కృష్ణ కుమార్ తెలిపారు.

డీఎస్ మృతదేహాన్ని సందర్శించిన కాంగ్రెస్ నాయకులు

ఇందల్వాయి, జూన్ 29:ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ పిసిసి అధ్యక్షుడు, మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు డి.శ్రీనివాస్ మృతదేహాన్ని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో రూరల్ కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు డి.శ్రీనివాస్ మృతిపట్ల విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలియజేశారు. డి.శ్రీనివాస్ కాంగ్రెస్‌లో ఎన్నో ఉన్నత పదవులను అధిరోహించారని నిజామాబాద్ జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకువచ్చారని అన్నారు. అలాంటి మహానాయకుడు మృతిచెందడం పార్టీకి తీరనిలోటని అన్నారు. ఆయన మృతదేహాన్ని సందర్శించిన వారిలో డిసిసి ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, కిసాన్ కేత్ నాయకుడు ముప్పగంగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, లారి గంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

హైదరాబాద్‌కు తరలిన నాయకులు

మోపాల్, జూన్ 29:మాజీ పీసీసీ అధ్యక్ష, మాజీ రాజ్యసభ సభ్యుడు డి.శ్రీనివాస్ మరణించిన సమాచారం అందడంతో మోపాల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఆయన మృతదేహాన్ని చూసి పార్టీ నాయకులు కన్నీరు మున్నీరు అయ్యారు. గత కొన్ని సంవత్సరాల నుంచి రూరల్ నియోజకవర్గంలో, జిల్లాలో రాజకీయంగా ఒక వెలుగు వెలిగిన డి.శ్రీనివాస్ మృతిని ఆ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. తమకు పెద్ద దిక్కుగా ఉన్న శ్రీనివాస్ మరణాన్ని నమ్మలేకపోతున్నారని అన్నారు. హైదరాబాద్‌కు తరలిన వారిలో కాంగ్రెస్ కిసాన్‌కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, భాస్కర్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

'మంచి నాయకుడిని కోల్పోయాం'

ఆర్మూర్‌టౌన్ , జూన్29: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో ఉన్నత పదవులు పొంది అందరికి ఆదర్శంగా నిలిచిన మంచి నాయకుడు డి.శ్రీనివాస్‌ను కోల్పోవడం బాధకరమని మాజీజడ్పీటీసీ గంట సదానందం అన్నారు. దళిత, బడుగు బలహీనవర్గాలకు ఆయన లేకపోవడం తీరని లోటని ఆయనను ఆదర్శవంతంగా తీసుకొని రాజకీయ నాయకులుగా ఎదిగిన వారు రాష్ట్రంలో చాలా మంది ఉన్నారన్నారు. డీఎస్ కుటుంబసభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

డీఎస్‌కు నివాళులు అర్పించిన వేల్పూర్ వాసులు

వేల్పూర్, జూన్29: మాజీ డీసీసీ అధ్యక్షుడు డీ.శ్రీనివాస్ మృతి పట్ల ఆయన స్వగ్రామమైన వేల్పూర్‌లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం వేర్వేరుగా ఘనంగా నివాళులు అర్పించారు. అంతకు ముందు డీఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తూ ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని 20నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 22 కోళ్లు మృతి

ఆర్మూర్‌టౌన్, జూన్29: మున్సిపల్ పరిధిలోని యోగేశ్వరకాలనీలో వీధికుక్కల దాడిలో 22కోళ్లు మృతిచెందాయని బాధితుడు పల్లె బోయిదాస్ తెలిపారు. ప్రతీరోజు మాదిరిగానే ఇంటి ఆవరణలో జాలిలో కోళ్లను మూసి ఉంచగా శనివారం ఉదయం లేచి చూసేసరికి కుక్కలు కోళ్ళపై దాడి చేసి చంపినట్టు ఆయన తెలిపారు. దీంతో సుమారు రూ.12వేల నష్టం వాటిల్లిందని అన్నారు. కుక్కల నివారణకై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కళాశాలకు అడ్మిషన్లు కరువు!

- ప్రభుత్వ నూతన జూనియర్ కళాశాలలో చేరేందుకు ఆసక్తి చూపని విద్యార్థులు
- నాలుగు గ్రూపుల్లో ఇప్పటివరకు కేవలం 46 అడ్మిషన్లే..

నాగిరెడ్డిపేట, జూన్ 29 : నాగిరెడ్డిపేట మండల కేంద్రానికి ఇంగ్లీష్, తెలుగు మీడియం ద్వారా నూతనంగా మంజూరైన కోఎడ్యుకేషన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25 ప్రస్తుత విద్యా సంవత్సరానికి గాను జరుగుతున్న అడ్మిషన్లలో ఈ కళాశాల చాలా వెనుకబడింది. మండల కేంద్రానికి మంజూరైన జూనియర్ కళాశాలకు సరైన భవన సౌకర్యం, ఫర్నీచర్ సౌకర్యం, తగినంత మంది లెక్చరర్లు లేకపోవడం తదితర కారణాల దృష్ట్యా ఈ నూతన జూనియర్ కళాశాలలో చేరేందుకు గ్రామీణ విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. కళాశాలలో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి అతి స్వల్పంగా దరఖాస్తులు వస్తున్నాయి. కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ నాలుగు గ్రూపులలో ఇంటర్ ప్రథమ సంవత్సరం కోసం ఇప్పటి వరకు కేవలం 46 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హేమ చందర్ తెలిపారు.

● ఈ విద్యా సంవత్సరం నుంచే కళాశాల ప్రారంభం

మండల కేంద్రానికి గత ఏడాది 2023-24లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేసింది. అడ్మిషన్ల గడువు ముగిశాక కళాశాల మంజూరు కావడంతో గత సంవత్సరం కళాశాలను జడ్పీహెచ్ఎస్ గోపాల్‌పేట పాఠశాల పాత భవనంలోని ఓ గదిలో నామ మాత్రంగా ప్రారంభోత్సవం జరిపారు. ప్రస్తుతం 2024-25 విద్యాసంవత్సరంలో కళాశాలలో విద్యా బోధన చేసేందుకు విద్యార్థుల నుంచి అడ్మిషన్‌లు తీసుకుంటున్నారు. గోపాల్‌పేట్ హైస్కూల్‌కు చెందిన పాత భవనంలోని మూడు గదులను ఈ జూనియర్ కళాశాల నిర్వాహణ కోసం కేటాయించారు. కళాశాలకు సంబంధించిన ఫర్నీచర్ సైతం ప్రభుత్వం ఇంత వరకు ఏర్పాటు చేయలేదు. కళాశాలకు అవసరమైన ఫర్నీచర్‌ను ప్రభుత్వం చేయాల్సి ఉంది. విద్యార్థుల కోసం 3,796 ఉచిత పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు సిబ్బంది తెలిపారు.

● ఎల్లారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు

ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హేమ చందర్‌కు ఉన్నతాధికారులు నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. ఎల్లారెడ్డి, పిట్లం ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన ఇద్దరు లెక్చరర్లను ఫిజిక్స్ లెక్చరర్ నాగయ్య, ఎకనామిక్స్ లెక్చరర్ విష్ణు, ఓఎస్ సంగయ్యకు నాగిరెడ్డిపేట జూనియర్ కళాశాలకు డిప్యూటేషన్‌పైన పంపించారు. దీంతో వీరు ప్రస్తుతం నాగిరెడ్డిపేట కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్లు స్వీకరిస్తున్నారు.

● ప్రచారం లేక అడ్మిషన్‌లు రావడం లేదు

మండలానికి నూతనంగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాల గురించి మండలంలో ప్రచారం జరుగకపోవడంతో, కళాశాల మంజూరైన విషయం చాలా మంది విద్యార్థులకు గాని విద్యార్థుల తల్లిదండ్రులకు గాని తెలియకపోవడంతోనే కళాశాలలో అడ్మిషన్లు జరగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గత ఏడాది కాలేజీని తాత్కాలికంగా ప్రారంభించినా, వచ్చే సంవత్సరం నుంచి ఈ నూతన కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని మండలంలోని హైస్కూల్‌లలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు కళాశాలకు సంబంధించిన అధ్యాపకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాల్సి ఉంది, కానీ నూతన కళాశాల మంజూరు గురించి మండలంలోని గ్రామాల్లో ప్రచారం లేకపోవడంతో విద్యార్థులకు తెలియకోవడంతో మండలానికి చెందిన పది పాసైన విద్యార్థులు ఇతర కళాశాలలో అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. నాగిరెడ్డిపేట నూతన జూనియర్ కళాశాలలో ఉచిత విద్య, ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ, స్కాలర్‌షిప్ మంజూరుతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందిస్తామని, ఉత్తమ ఫలితాలు సాధిస్తామని కళాశాల లెక్చరర్‌లు చెప్తున్నారు. మండలంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు నూతనంగా మంజూరైన నాగిరెడ్డిపేట జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కళాశాలకు కేటాయించిన గోపాల్‌పేట హైస్కూల్ పాత భవనం

జూలై 1 నుంచి తరగతులు ప్రారంభిస్తున్నాం..

● హేమ చందర్, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూలై 1న నుంచి విద్యార్థులకు తరగతులను ప్రారంభిస్తున్నాం. ఇప్పటి వరకు కళాశాలలో 46మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. మొదటి విడత అడ్మిషన్‌ల ప్రక్రియ పూర్తి కాగా రెండో విడత అడ్మిషన్‌ల ప్రక్రియ జూలై 31వరకు ప్రభుత్వం గడువును పెంచింది. జూలై మాసం చివరి వరకు విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్‌లు పొందవచ్చు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ నరసింహారెడ్డి

డయల్ 100 ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

● ఏఎస్పీ నరసింహారెడ్డి

కామారెడ్డిటౌన్, జూన్29: డయల్ 100 ఫిర్యాదుకు త్వరగా స్పందించాలని ఏఎస్పీ నరసింహారెడ్డి సిబ్బందికి సూచించారు. శనివారం జిల్లాపరిధిలోని పోలీసుస్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న బ్లూకోల్ట్, పెట్రోకారు సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదు రాగానే క్షణాల్లో స్పందించాల్సిన బాధ్యత బ్లూకోల్ట్స్, పెట్రోకారు సిబ్బందిపై ఉందని తెలిపారు.ముందస్తు సమాచారాన్ని సేకరించాల్సి ఉంటుందని, ఇలాంటి ముందస్తు సమాచారంఅధికారులకుచేరవేయడం ద్వారా నేరాల నియంత్రణతో పాటు శాంతిభద్రతలను పరిరక్షించుకోవచ్చని తెలిపారు. సమావేశంలో డీఎస్‌బీ ఎస్సెక్టర్ జార్జ్ ,పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, బిచ్కుంద ఇన్‌స్పెక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తైబజార్ వసూళ్లలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

● ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

భిక్కనూరు, జూన్ 29: తైబజార్ వసూళ్లలో అవకతవకలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం భిక్కనూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో తైబజార్ వేలం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేలంలో గ్రామానికి చెందిన నంద రాములు రోజువారి తైబజార్‌ను రూ.4.5 లక్షలకు దక్కించుకోవడం జరిగిందని, వారంతపు సంతకు సంబంధించి నంద సిద్దేశ్ రూ.5.70 లక్షలకు దక్కించుకోవడం జరిగిందన్నారు. తైబజార్ దక్కించుకున్న వారు తైబజార్ వసూళ్లలో ఎలాంటి అవకతవకలకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈవో మహేష్‌గౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

బొగ్గు గనులను సింగరేణి సంస్థకే ఇవ్వాలి: సీపీఎం

కామారెడ్డి రూరల్, జూన్29: బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని శ్రావణ్‌పల్లి బొగ్గు బ్లాకును కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వేలం పాటను వేస్తుందని సింగరేణి కంపెనీ కూడా ప్రైవేట్ కంపెనీలతో పోటీపడే స్థితికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలంపాటను ప్రారంభించడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వ రంగంలో బొగ్గు గనులు లేకపోతే యువతకు ఉపాధి అవకాశాలు కనుమరుగవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజానీకానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని, శ్రావణపల్లి బ్లాకుతోపాటు మిగతా బ్లాకులను తక్షణమే సింగరేణి అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజానీకాన్ని కలుపుకొని ఉద్యమాలకు శ్రీకారం చూడతామని హెచ్చరించారు.

'వ్యవసాయ కూలీలకు జీవనభృతి ఇవ్వాలి'

రామారెడ్డి, జూన్ 29: వ్యవసాయకూలీలకు జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఇన్‌చార్జ్ తహసీల్దార్ లక్ష్మన్‌కు శనివారం వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా రాష్ట్రప్రధానకార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో 59శాతం మంది వ్యవసాయరంగంలో పనిచేస్తున్నారని అన్నారు. రెక్కాడితే కాని డొక్కలు నిండని, ఎలాంటి ఆస్తులు లేని 14 కోట్ల మంది వ్యవసాయకార్మికులే ఉన్నారని అన్నారు. నారుపోసిన నుండి కోతకోసేవరకు వివిధ రకాలుగా పనిచేస్తు శ్రమను నమ్ముకుని జీవిస్తున్న వ్యవసాయకార్మికులకుచాలిచాలని జీతాలు అందించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, ప్రకాష్, సురేష్, రమేష్, కిష్టర్, గోపాల్, వెంకట్, మధు, రాజు, మీనా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చట్టాలపై అవగాహన

రాజంపేట, జూన్29: మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయాధికారి సుధాకర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు, రైతులు చట్టాలు,హక్కుల కోసం పూర్తిగా తెలుసుకోవాలని తెలిపారు. భూములు కొనేవారైన, అమ్మేవారైన తెల్లపేపర్ కాకుండా పహానిలు పరిశీలించి తీసుకోవాలని తర్వాత ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని అన్నారు. విత్తనాలు వేసే రైతులు ప్రైవేట్ దుకాణాలలో విత్తనాలు కొనుగోలు చేస్తే షాపునకు వ్యవసాయశాఖ ధ్రువీకరించిన లైసెన్స్ ఉండాలని తెలిపారు.రైతులు రశీదులు ఖచ్చితంగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారిని సుప్రజ్యోతి, జిల్లా అడ్వకేట్స్ సిద్ధిరాములు, ఆజాద్,సలీం, తహసీల్దార్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్‌లో తైబజార్, మేకల సంతకు వేలం

కామారెడ్డి టౌన్, జూన్ 29: కామారెడ్డి మున్సిపల్‌లో శనివారం నిర్వహించిన తైబజార్ వేలం నిర్వహించినట్లు మున్సిపల్ కమీషనర్ సుజాత తెలిపారు. మేకల సంతను అబ్దుల్‌రావుఫ్, సఫియాబేగంలు పాల్గొన్నారని ఇందులో సఫియాబేగం రూ.4లక్షలతో వేలం పాటను దక్కించుకుందని తెలిపారు.అలాగే తైబజార్ వేలంకు ఒకే దరఖాస్తు రావడంతో వేలం పాటను వాయిదా వేసినట్లు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి: డీపీఎం

దోమకొండ, జూన్ 29: మహిళా సంఘాల ద్వారా రుణాలు పొంది జీవనోపాధులు పెంచుకుని మహిళలు ఆర్థికంగా ఎదిగేలా చూడాలని డీపీఎం రవీందర్‌రావు అన్నారు. శనివారం మండల సమాఖ్యలో నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ మహిళా శక్తిలో భాగంగా ఎంటర్‌ప్రైజెస్‌ల ఏర్పాటు, పాడి గేదెలు, పెరటి కోళ్లపెంపకం, కొట్టు కేంద్రాలు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లకు బ్యాంకు, శ్రీనిధి ద్వారా రుణాలు అందించి మహిళల జీవనోపాధిని పెంచుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం రాజు,వకుళ, అధ్యక్షురాలు గౌరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

'చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలి'

బీర్కూర్, జూన్ 29 : ప్రధాన కాలువ ద్వారా సాగు నీరు విడుదల చేసినా తమ పొలాలకు నీరు అందడం లేదని, చివర ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు. శనివారం రైతులు ఎంపీపీ రఘుతో కలిసి 26వ డిస్ట్రిబ్యూటరీ కాలువను పరిశీలించారు. తూము శెట్టర్ పూర్తిస్థాయిలో తెరవక పోవడంతో నీరు సన్నగా వస్తుండడంతో ఎంపీపీ రఘు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి శెట్టర్ పూర్తిస్థాయిలో పైకి ఎత్తించారు. ఎంపీపీ వెంట నాయకులు గంగారాం, గంగులు, రైతులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం

బిచ్కుంద, జూన్29: రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని గుండెనెమలిలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈసీజీ, షుగర్,బీపీ,కంటి పరీక్షలు చేసి మందులను అందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కుమార్, డాక్టర్ విక్రమ్‌కుమార్,వైస్ చైర్మన్ శివకాంత్, డివిజన్ సభ్యులు వెంకటరమణ, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

10 ఎకరాలలోపు రైతులకే రైతు భరోసా ఇవ్వాలి

● రైతుల ఏకగ్రీవ తీర్మానం

భిక్కనూరు, జూన్29: 10 ఎకరాలలోపు భూమి ఉన్న ప్రతీ రైతుకు రైతు భరోసాను అమలు చేయాలని రైతులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. శనివారం భిక్కనూరు, మండలంలోని రామేశ్వర్‌పల్లి విండో కార్యాలయాల్లో రైతు భరోసాపై ప్రత్యేక మహాజనసభ కార్యక్రమాన్ని ఆయావిండో చైర్మన్లు భూంరెడ్డి, భూమయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 10ఎకరాలలోపు వ్యవసాయ భూమి వారికే రైతుభరోస, రైతు బీమా కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏవో రాధ, ఆయాశాఖల అధికారులు, విండో ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, శేఖర్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



రామేశ్వర్‌పల్లిలో మహాజనసభ నిర్వహిస్తున్న దృశ్యం



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న దృశ్యం

పారిశుధ్య పనుల పరిశీలన

బాన్సువాడటౌన్, జూన్29: బాన్సువాడ పట్టణంలో పారిశుధ్య పనులను శనివారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దృష్టిలోఉంచుకుని సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ తదితర వ్యాదులు ప్రబల కుండా పట్టణ ప్రజలందరూ చెత్తను డ్రైనేజీలో పడవేయద్దని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా బ్లీచింగ్‌పౌడర్, దోమల పౌడర్ కలిపి పట్టణంలోని డ్రైనేజీలలో చల్లాలని తెలిపారు. కార్యక్రమంలో నార్ల ఉదయ్, మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

'ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోండి'

బీర్కూర్, జూన్29: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ, టీఎస్‌పీ విద్యార్థి సంఘాల అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, శ్రీకాంత్ డిమాండ్ చేశారు బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులకు అందించాల్సిన పాఠ్య పుస్తకాలను, పాతఇనుప సామాన్లు కొనుగోలు చేసే వ్యక్తికి కిలోల చొప్పున తూకం వేసి విక్రయించారని నాయకులు ఆరోపించారు. శనివారం ఎంఈవో కార్యాలయానికి చేరుకుని ఎంఈవో కార్యాలయ సిబ్బందికి ఫిర్యాదు చేశారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొడుకును హత్య చేసిన తండ్రి

- ఆస్తి పంచాలని అడిగినందుకే ఘాతుకం
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

ఎల్లారెడ్డి, జూన్ 29: ఆస్తి పంచి ఇవ్వాలని తరుచూ ఘర్షణకు దిగుతున్న కొడుకును తండ్రి హత్య చేసిన ఘటన ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని గండిమాసానిపేట్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండి మాసానిపేట్‌కు చెందిన కొడిపాక వెంకటేశానికి ఇద్దరు కుమారుల్లో పెద్దకొడుకు సాయిలు మద్యానికి బానిసై ఆస్తి పంచి ఇవ్వాలని తండ్రితో తరుచూ గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి సాయిలు తండ్రి వెంకటేశంతో ఆస్తి పంచాలని ఘర్షణకు పడ్డాడు. కోపోద్రిక్తుడైన వెంకటేశం కర్రతో దాడి చేయగా సాయిలు అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. అనంతరం కొడుకు మృతదేహాన్ని గ్రామ పరిసరాల్లోని కాలువ పక్కన పడేసినట్లు ఎస్సై బొజ్జ మహేష్ వెల్లడించారు. తెలిపారు. శనివారం గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారించగా సాయిలును తానే హత్య చేసినట్లు వెంకటేశం తెలిపారు. ఘటన స్థలాన్ని డీఎస్పీ శ్రీనివాస్ పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య అనసూయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.



అధిక ఫీజులు వసూలుచేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్, జూన్29: కామారెడ్డి జిల్లాకేంద్రంలో ఉన్న ఎస్‌పీఆర్, లిటిల్ స్కాలర్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా అధికఫీజులు వసూలు చేస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. శనివారం ఆయా పాఠశాలల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌పీఆర్, లిటిల్ స్కాలర్స్ పాఠశాలలో రూ.40వేల నుంచి రూ.లక్ష వరకు ఫీజులను వసూలు చేస్తున్నారని తెలిపారు. దిశ పేరుతో అదనంగా మరో రూ.15వేలు వసూలు చేస్తున్నారని ఈ ఫీజులను వసూలు చేయాలంటే గవర్నింగ్‌బాడి ఏర్పాటుచేసి తల్లిదండ్రుల సమక్షంలో ఫీజులను నిర్ణయించి దాని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆమోదం తెలిపిన తర్వాత ఫీజులు వసూలు చేయాలని అన్నారు. కాని ఆయా పాఠశాలలు తమకు నచ్చిన విధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. పాఠశాలలో పుస్తకాలను, టై,బెల్ట్ అమ్ముతూ విద్యాసంస్థలు వ్యాపారకేంద్రాలుగా మారుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీవీఎం రాష్ట్రకార్యదర్శి విఠల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, జిల్లా కార్యదర్శి భరత్, బీవీయం జిల్లా అధ్యక్షుడు ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షుడు బుల్లెట్, అర్బాస్‌ఖాన్, ఎస్ఎఫ్ఐ నాయకులు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

అంగన్‌వాడీ టీచర్లకు నూతన విద్యాబోధనపై శిక్షణ

మద్నూర్, జూన్29: అంగన్‌వాడీ వర్కర్లు ఇక నుంచి విద్యార్థులకు నూతన విద్యా బోధన చేయాలని మద్నూర్ ప్రాజెక్టు సీడీపీవో సునంద సూచించారు. శనివారం మద్నూర్ ప్రాజెక్టు పరిధిలో విడతల వారీగా అంగన్‌వాడీ వర్కర్లకు విద్యాబోధనపై శిక్షణ ఇచ్చారు. ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం అందించి అహ్లాదకరమైన వాతావరణంలో ఆట, పాటలతో విద్యాబోధన చేపడుతున్నారు. ఇక నుంచి ప్రభుత్వం అంగన్‌వాడీలను ప్రీ స్కూల్స్‌గా సిద్ధం చేయడంతో, ప్రీ స్కూల్‌లో మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలుగా ప్రేరణాత్మక, కృత్య ధార బోధన ఉంటుందని తెలిపారు. జూన్ నుంచి ఆగస్టు వరకు ఆట పాటలు, ప్రకృతి, సైన్స్, యోగా, పూర్వగణితం, రంగులు ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తారని అన్నారు. నాలుగో శనివారం పూర్వ ప్రాథమిక విద్యా దినోత్సవం జరిపి కృత్యాలు కార్యక్రమాలను ప్రదర్శించాలని తెలిపారు. పిల్లల్లో వచ్చిన మార్పులు అభివృద్ధిని తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు కవిత తదితరులు పాల్గొన్నారు.



మూడో బ్యాచ్‌లోని అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇస్తున్న సీడీపీవో సునంద

భోజనశాల నిర్మాణ పనులకు శంకుస్థాపన

బీబీపేట, జూన్ 29: బీబీపేట మండల కేంద్రంలోని తుజాల్‌పూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో భోజన శాఖ నిర్మాణానికి జడ్పీవైస్‌చైర్మన్ ప్రేమ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం మాజీ మెదక్ ఎంపీ కొత్తప్రభాకర్ గతంలో విడుదల చేసిన రూ.5లక్షల ఎంపీ ల్యాండ్స్‌తో నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలమణి, ప్రధానోపాధ్యాయుడు అశోక్, పంచాయతీ కార్యదర్శి ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

'జాతీయ గోర్‌బంజారా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి'

కామారెడ్డిరూరల్, జూన్ 29: హైదరాబాద్ రవీంద్రభారతిలో సోమవారం నిర్వహించే జాతీయ గోర్ బంజారా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు నునావత్ గణేష్ నాయక్,కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాణాప్రతాప్ రాథోడ్ తెలిపారు. జిల్లాకేంద్రంలో లంబాడ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బంజారా భాష లిపిని అధికారంగా ప్రకటించాలని అన్నారు. కార్యక్రమంలో బంజారా నాయకులు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ నాయక్,భూక్యరాజు నాయక్, ఎల్లారెడ్డి ఎస్టీసెల్ డివిజన్ అధ్యక్షుడు మదన్‌లాల్,రోత్తవన్ మోహన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

తైబజార్ వేలం

గాంధారి, జూన్29: గ్రామపంచాయతీ కార్యాలయంలో తైబజార్‌ను వాడికర్ శ్రీధర్ దక్కించుకున్నారని స్పెషల్ ఆఫీసర్ తహసీల్దార్ సతీష్‌రెడ్డి తెలిపారు. శనివారం వేలం పాట నిర్వహించగా ఇద్దరు వేలం పాటలో పాల్గొనగా శ్రీధర్ రూ.1లక్ష 75వేలకు వేలం దక్కించుకున్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి - ఓసీ
దర్శన్ - కల్కి
ప్రియా 70 - కల్కి

బాన్సువాడ

మహేశ్వరి - కల్కి
వెంకటేశ్వర - నింద

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

